# ఇల్లు బాగుపడితే జగత్తు బాగుపడుతుంది

పాప భయంబు పోయె పరిపాటయిపోయెను దుష్కృతంబిలన్
శ్రీపతి భక్తిపోయె వివరింపగ లేని దురంత కృత్యముల్
దాపురమయ్యె లోకమున తాపసలోక శరణ్యుడైన ఆ
శ్రీపతి నామచింతనయె చేకురచేయు సుఖంబు మానవా!

ఉద్యోగములు చేయనువిదలందరు పోవ
  గృహ కృత్యములు దీర్చు గృహిణులెవరు?
ఆల్మగలిరువురు ఆఫీసులకుబోవ
  ఇంటి పనులుజేయు ఇంతులెవరు?
పర బాలురకు నేర్ప పాఠశాలలకేగ
  తమ బాలురకు నేర్పు తల్లులెవరు?
పుస్తకాల్ చేబట్టి పురుషులవలె బోవ
  వంటయింటిని దిద్దు వనితలెవరు?
డబ్బు లేని యట్టి యిబ్బంది తీరిన
ఇంటిలోని కొరతలెంతయుండు
సుఖము చూడబోవ సున్నయే యుద్యోగ
పదవియందునున్న పడతికెపుడు

ప్రేమస్వరూపులారా!

స్త్రీలు చదవకూడదనికాదు, నా ఉద్దేశ్యము. చదవవలసిందే! ఉద్యోగములు చేయవలసిందే! కానీ స్త్రీయందుండిన దివ్యమైన బిరుదునకు సార్ధకతనందించాలి. స్త్రీకి

srisathyasaivachanamrutam

మొట్టమొదటి బిరుదు 'గృహలక్ష్మి'. ఆ గృహమునకు తగిన సౌభాగ్యమును, సౌశీల్యమును చేకూర్చాలి. ఈమె గృహలక్ష్మిగానీ ఆఫీసులక్ష్మికాదు. ఈమెకు రెండవ బిరుదు 'అర్థాంగి'. ఎవరికి అర్థాంగి? పతికి అర్థాంగికానీ పనికి అర్థాంగికాదు. ఈమెకు మూడవ బిరుదు 'ఇల్లాలు'. ఇంటికి ఆలికానీ ఆఫీసుకు ఆలికాదు. 'ధర్మపత్ని' నాల్గవది. సర్వధర్మములకు నిలయము గృహము. ప్రాచీనకాలమునుండి భారతదేశమందు ప్రచారప్రబోధలు సల్పుతూ వచ్చిన దివ్యమైన, నవ్యమైన ధర్మమునకు అదియే పుట్టినిల్లు. మనము ఈనాడు కాపాడవలసినది ధర్మము, సత్యములనేగానీ దేశమునుకాదు. సత్యధర్మములు మనము కాపాడినప్పుడు అవియే దేశాన్ని కాపాడతాయి. కనుక మన గృహమునందు ధర్మోద్ధరణ చేయాలి. గృహము కేవలము సామాన్యమైనదికాదు.

**వలదన్న సద్గ్రంథపఠన లేకయె**
**పలుశాస్త్రములు నేర్పు పాఠశాల**
**శ్రమలేక తనయందు సర్వంబు సమకూర్చి**
**ఆనందమొసగు విహారభూమి**
**అజహరాదులనైన పసిపాపలుగ జేయు**
**మహిమను చేకూర్చు మంత్రశాల**
**పతి గృహంబె సతులకు పాఠశాల.**

**పుట్టిన ప్రతిబిడ్డకు తల్లియే ప్రథమ గురువు**

మన గృహము ఒక ఆదర్శ పాఠశాల. లోకమును ఉద్ధరింపచేసే ధర్మమునకు నిలయము. లోకమును సంరక్షించే సత్యదీపము వెలిగే స్థలము. ఎన్ని చదువులు చదివినా ఎంత అధికారము చేబట్టినప్పటికి మొట్టమొదట తమ గృహమును సరిదిద్దుకోటము స్త్రీల ప్రత్యేకకర్తవ్యము. అనేక వేల, లక్షల, కోట్ల విద్యార్థులకు, పసిపాపలకు మాతృమూర్తి తల్లి. పుట్టిన ప్రతి బిడ్డకు తల్లియే ప్రథమ గురువు. అట్టి గురువు తన బిడ్డలను వదలి పరుల బిడ్డలకు బోధించుటకు వెళ్లినప్పుడు తన గృహము ఏగతి కాగలదు? భారతస్త్రీకి ప్రధాన కర్తవ్యము, ముఖ్యమైన ఆదర్శము, లక్ష్యము, తన గృహమును తాను చక్కదిద్దుకోటము.

srisathyasaivachanamrutam

యావత్ప్రపంచమునకు గృహమే ఆధారము. ఇల్లు బాగుపడితే జగత్తు బాగుపడుతుంది. దృశ్యకల్పితమైన జగత్తునందు ఎంత సౌభాగ్యము, ఎంత సంతోషము, ఎన్ని ఆహ్లాదములు, ఎన్ని ఆనందములు అనుభవించినా ఇంటిలో ఆనందము లేకపోతే అది పెద్ద నరకమువలె తోస్తుంది. ఇల్లే స్వర్గము. గృహమే కైవల్యము. ఇలాంటి ఇల్లును మొట్టమొదట సరిదిద్దుకోటము ప్రధాన కర్తవ్యము. అందువలననే మన భారతీయులలో ఆంధ్రులు చెబుతుంటారు. 'ఇల్లు గెలిచి రచ్చ గెలవమన్నారు', అని. ప్రాచీనకాలమునుండి భారతదేశముయొక్క కీర్తి, ప్రతిష్ఠలంతయు గృహలక్ష్మివలనే అభివృద్ధి గాంచినవి.

**గతజీవుడగు పతిని బ్రతికించుకొన్నట్టి**
**సావిత్రి భరతసతియెకాదె**
**తనసత్యమహిమచే దావాగ్ని చల్లార్చె**
**చంద్రమతి పవిత్ర పడతికాదె**
**కులసతీత్వమునకై గుండాన దూకిన**
**సీత భారత ధరాజాత కాదె**
**కినిసి దుర్మతకిరాతుని బూదిగావించె**
**దమయంతి భారత రమణికాదె**
**సప్తసాగర పరితోష్టితోర్వితలము**
**భరతజాతి పాతివ్రత్య ప్రవిమలంబు**
**భావసంపదకిది మహా పంటభూమి**
**అఖిలదేశాలకిది ఉపాధ్యాయకాదె**

ఇంతటి గొప్ప కీర్తి సాధించిన పవిత్రమైన భారతదేశమందు ఆవిర్భవించిన స్త్రీల జన్మమే జన్మము. పవిత్రమూర్తి సర్వకాలములందు శాశ్వతకీర్తిని సాధించిన గంగానది మాతృమూర్తి కాదా! భూమాతా, గోమాత, వేదమాతలయొక్క నిలయము భారతదేశము కాదా! ఇట్టి పవిత్రమాతయైన మాతృమూర్తులకు నిలయమైన ఈ భారతదేశమందు ఈనాడు స్త్రీలు కేవలము తమ కర్తవ్యములను విస్మరించి బయట ప్రపంచముయొక్క విషయమును

srisathyasaivachanamrutam

విశ్వసించి తమయొక్క దివ్యత్వము తాము కోల్పోవటము సరియైనదికాదని గుర్తించాలి.

**పరమపావనమైన భారతావనియందు**
**సహనమన్నదె మనకు చక్కదనము**
**వ్రతములన్నిటియందు వన్నె గాంచినయట్టి**
**ఘన సత్యశీలమే కఠినతపము**
**మధురభావంబేది మనదేశమందన్న**
**మాతృభావముకన్న మాన్యమెద్ది**
**ప్రాణంబు కంటెను మానంబె ఘనమను**
**మన దేశనీతిని మంటగలిపి**
**నేటికిచ్చిరి పరదేశనీతు లరసి**
**వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి**
**ఔర! ఏమందు భారత పాలనంబు**
**ఏనుగెట్టుల తన బల మెరుగలేదొ**
**అట్టులైనారు మన భారతీయులు నేడు.**

**మానవుడు మనస్సుపై ఆధారపడినంతకాలము ఆధ్యాత్మికము హృదయమునకు హత్తుకోదు**

అనాదికాలమునుండి భారతదేశము అన్ని దేశములకు ఆధ్యాత్మిక ప్రభావతత్త్వముచేత శాశ్వతకీర్తిని సంపాయించి అందించినది. నాటిమొదలు నేటివరకు 'లోకా స్సమస్తా సుఖినోభవంతు' అన్నది హైందవ సాంప్రదాయము. ఈ సాంప్రదాయము శాశ్వతముగా నిలబెట్టుటకై అనేకమంది ఆనాటి రాజులు, ఆనాటి పతివ్రతామ తల్లులు, స్త్రీలు అనేక త్యాగములు చేస్తూ వచ్చారు. ఇట్టి అనాది, అప్రమేయమైన ప్రమాణములను తాము విశ్వసించి దివ్యమైన, నవ్యమైన భారతదేశములో ధర్మమును ఉద్ధరించుటకు కంకణము కట్టుకొని ప్రయత్నించాలి. చదువులు చదివినంతమాత్రమున చాలదు.

**చదువులన్ని చదివి చాల వివేకియై**
**మగిడి తన్నెరుగడు మందమతుడు**

srisathyasaivachanamrutam

**ఎంత చదువు చదివి ఏరీతినున్నను**
**హీనుడవగుణంబు మానలేడు.**
**తరచి చదువు చదువ తర్కవాదమెగాని**
**పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు**
**చదువులన్ని చదివి చావంగనేటికి?**
**చావులేని చదువు చదువవలయు.**

అదియే ఆధ్యాత్మిక చదువు. మానవునికి ఈ మనస్సుతో సన్నిహిత సంబంధము ఉండినంతకాలము ఆధ్యాత్మికము అతని హృదయమునకు హత్తుకోదు. మనస్సు చమత్కారమైనది. దీనిరూపము మరింత విచిత్రమైనది. దీని నిలయము మహా కీలకమైనది. దీని రూపము గుర్తించుటకు వీలుకానిది. అన్నిరూపములు తానే! తాను కాని రూపములేదు. యావత్ప్రపంచమంతయు మనస్సుపైనే ఆధారపడి ఉంటున్నది. ఇట్టి మనస్తత్వమును మానవుడు ఏనాడు గుర్తించునో ఆనాడే దివ్యత్వమునుకూడా గుర్తించినవాడౌతాడు. మనస్సుకు రూపములేదు. అయితే దేనిని తాను ఆశ్రయించునో ఆ స్వరూపాన్ని పొందుతుంది. ఈ మనస్సునందు అనేక దుర్గుణములు, సద్గుణములు మిళితమై ఉంటున్నాయి. పుణ్యము యిదే అందిస్తుంది. పాపము యిదే చేయిస్తుంది. ఆనందమును అందిస్తుంది, దుఃఖమును అందిస్తుంది.

**మితిమీరిన ఆశవలన మతిహాని కలుగుతుంది**

**కన్నీరు తప్పించు కన్నీరు తెప్పించు**
**యోగిని భోగిగ చేయు భోగిని యోగిగ చేయు**
**పిచ్చులు పట్టించు పిచ్చిని పోగొట్టును**

ఇది చేయని పనిలేదు. ఈ మనస్సు అన్ని పనులు చేస్తుంది. అయితే దీనిని ఉపయోగించుకునే విధానములో ఉంటున్నాయి, మంచి చెడ్డలు. మనస్సు తత్వము గుర్తించుటకు విద్యలుకాదు, ఆధారము. సిరిసంపదలు కాదు, ఆధారము. పదవి, కీర్తులు కాదు, దీనికి ఆధారము. అయితే ఎన్నో చెడ్డగుణములుంటున్నాయి, మానవునియందు



sri sathyasai vachanamrutam

అనుకుంటున్నాము. ఎన్నో చెడ్డగుణములు లేవు. ఉన్నది ఒక్కటే! అదే ఎంత శ్రీమంతునికైనా ఒక్కతూరి అనేక విధములైన విపత్తులను కలిగిస్తుంది. ఎంతటి తపశ్శక్తిసంపన్నునైనా ఒక్క పర్యాయములో మార్చివేస్తుంది. సర్వశక్తిసంపన్నునికైనా ఒక్క క్షణములో పడవేస్తుంది. భారతదేశమందు ప్రతి భారతీయుని యింటియందు నిత్యసత్యములుగా ప్రకాశించే రామాయణ, భారత, భాగవతములందున్న ప్రమాణములు ప్రతి ఒక్కరు వెనుకకు తిరిగి చూడాలి. రావణుని శక్తి యిట్టిది, అట్టిది అని చెప్పుటకు వీలుకాదు. 64 విద్యలు నేర్చినవాడు రావణుడు. మహాశక్తిసంపన్నుడు రావణుడు. తన సోదరుడైన కుబేరుని రథము లాగుకొని అతనిని ఓడించినవాడు. మహాతపస్సంపన్నుడు. అట్టి శక్తిసామర్థ్యములు కల్గిన రావణుని ఒక్క క్షణములో అధోగతికి తెచ్చింది. ఏది అది? దురాశ. ఈ రావణునికి ఏమి తక్కువ? కోరరాని కోరికలు ఎందుకు కోరాలి? యితని జ్ఞానం ఎక్కడ పోయింది? యితని తపఃశక్తి ఎక్కడ పోయింది? ఈ దురాశ ఉండటంవల్ల అతను అథః పతనమైపోయాడు. అతను మాత్రమే పతనము కాకుండా అతని రాజ్యము భస్మము గావించుకున్నాడు. ఇంక హిరణ్యకశిపుడు. ఇతనిలో లేని శక్తి మరొకరిలో లేదు. గొప్ప సైంటిస్టు. ఈనాటి విజ్ఞాన శాస్త్రజ్ఞులందరుకూడా అతనిలో నూరింట ఒక్క భాగమైనా తెలుసుకోలేదు. పంచభూతములు హస్తగతము గావించుకున్నాడు. అలాంటి శక్తిసామర్థ్యములు కలిగిన హిరణ్యకశిపుడు కట్టకడపటికి హరిద్వేషముచేత పతనమైపోయాడు. గొప్ప రాజనీతి తెలిసినవాడు, దుర్యోధనుడు. అతనికి భుజబలము, బుద్ధిబలము, ధనబలము కావలసినంత ఉన్నాయి. ఇన్ని ఉండి ప్రయోజనం ఏమిటి? ప్రలోభమే అతనిని అధఃపతనము చేసింది. ఈ చరిత్రలు మానవునికి ఏమి బోధిస్తున్నాయి? దురాశ మంచిదికాదని ప్రబోధిస్తున్నాయి. ఆశలు ఉండవలసిందే, అనుభవించవలసిందే, ఆనందించవలసిందే? కానీ మితిమీరి ఆశ మతిహాని కలుగుతుంది. ఇట్టి మితిమీరిన ఆశ కలిగిన పతులను సరైన మార్గములో ప్రవేశపెట్టి వారికి సరైన బోధలు చేసి వారిని సరైన మానవులుగా తీర్చిదిద్దటానికి అనేకమంది స్త్రీలు ఎంతో ప్రయత్నము సలిపారు.

**భర్త దుర్మార్గుడై కీడు బడయు వేళ**
**మంత్రి యట్టుల మేల్ కీడు మనవి జేసి**

sri sathyasai vahamrutam

**పతికి హితము గఱుపగా పడతులెపుడు**
**నడువవలెను మండోదరి యట్లు భువిని.**

ఆ పతికి ఎన్ని హితములు బోధించింది, ఎన్ని సుబోధలు చేసింది! కానీ, అతను వినిపించుకోలేదు. ఆమె సుబోధలవలన అతను పదినెలలు బ్రతకగలిగాడు. ఈ విధముగా ప్రాచీనకాలమునుండి భారతనారీమణులు ఎన్ని విధములైన ఆదర్శములనో నిరూపించి, అందించి దేశమును కాపాడుతూ వచ్చారు.

**ఇంద్రియములకు అధిపతియైన మనస్సును స్వాధీనము చేసుకోవాలి**

దివ్యాత్మస్వరూపులైన నారీమణులారా! మీరు ఈనాటినుండైనా మీమీ గృహములలో సరైన మార్గాన్ని అభివృద్ధిపరచి, దివ్యత్వమనే మొక్కను నాటి పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టటానికి ప్రయత్నించాలి. మనస్సుయొక్క ప్రభావము చక్కగా గుర్తించి వర్తించాలి. మనస్సు మానవుని ఒక్క క్షణములో దానవునిగా మారుస్తుంది. ఒక్క క్షణములో పశువుగా మారుస్తుంది. పశువును ఒక్క క్షణములో పశుపతిగా మారుస్తుంది. ఇన్ని విధములైన శక్తిసామర్థ్యములతో సర్వులయందు సంచరిస్తున్న మనస్సు ఒక్కటే! ఇట్టి మనస్సు తత్త్వము చక్కగా గుర్తించి సరియైన మార్గములో ప్రవేశపెట్టాలి. 'హే మనసా! నీవు తలచినట్టుగా నీవు వర్తించకూడదు. నీవు ఎవరు? ఇంద్రియములకు అధిపతివి. నీవు ఇంద్రుడు. మన చరిత్రలందు ఇంద్రుని అనేక విధములుగా వర్ణిస్తున్నాము. ఇంద్రుడు వేరే ఏ లోకములోనో లేడు. మన యింద్రియములకధిపతియైన మనసే ఇంద్రుడు. కనుకనే వేదమందు 'చంద్రమా మనసో జాతః చక్షోసూర్యోఅజాయత ముఖా దింద్రశ్చ అగ్నిశ్చ...' అని వర్ణింపబడింది. మన యింద్రత్వము మనయొక్క గుణములందే ఉంటున్నది. ఇంద్రియములకధిపతియైన మనస్సును స్వాధీనము చేసుకోవాలి. ఈ ఇంద్రుడు బుద్ధికి స్వాధీనమై ఉంటున్నాడు. బుద్ధి ఆత్మకు స్వాధీనము. కనుక, 'బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్'. ఒక్క ఆత్మభావముచే అన్నీ మనకు వశమైపోతాయి.

**ఈనాడు దేశములోని విపత్కర పరిస్థితులకు మూలకారణము ఆత్మవిశ్వాసము కోల్పోవటమే!**

srisathyasaivachanamrutam

ప్రేమస్వరూపులారా! ఈనాడు దేశము ఏ పరిస్థితిలో ఉందో చిన్న పిల్లవానికికూడా తెలుసు. ఎక్కడ చూచినా, ఎక్కడ విన్నా భయంకర దృశ్యములే గోచరిస్తున్నాయి, వినిపిస్తున్నాయి. దీనికి మూలకారణము ఏమిటి? మూలాధారమేమిటి? కేవలము మనలో ఉండిన మన ప్రభావమును గుర్తించుకోలేకపోవటమునకు కారణము మితిమీరిన ఆశలు పెరిగిపోవటమే! దీనికి తగినట్టుగా స్వార్థము, స్వప్రయోజనం చాలా అధికమైపోయింది. అన్నింటికి మూలకారణము ఆత్మవిశ్వాసము కోల్పోవటమే! ఆత్మవిశ్వాసము అత్యవసరము. అట్టి ఆత్మవిశ్వాసమే లేకపోయిన అన్నీ మనకు అపశకునములే! అన్నీ మనకు అశాంతులే! అశాంతితోకూడిన వానికి ఏమి కావాలి? ప్రపంచమే వానికి అక్కరలేదు. శాంతిలోనుండినవానికే ఈ ప్రపంచము కావాలి. ఈనాడు ఏ మానవునియందుకూడా వెతికినా కించిత్తైనా శాంతి కనిపించటంలేదు. శాంతికోసమని భూమిని వదలి చంద్రమండలము వెడుతున్నారు. ఆ చంద్రమండలము వెళ్లినా శరీరము చల్లబడుతున్నాది గానీ మనసు వేడెక్కుతుంది.

**హస్తమున అణుబాంబునుంచుక**
**అరచుచుందురు శాంతి శాంతియని**

ఏమిటి? ఎక్కడనుంచి వస్తుంది శాంతి? చేతిలో ఉంది బాంబు. అలాంటి బాంబు పట్టుకుంటే శాంతి లభ్యమవుతుందా? అశాంతితో భయంకరమైన దానిలో కృంగిపోతాడా? ఈనాడు కలియుగమందు అనేక విధములైన మార్గములలోపల భయంకర దృశ్యములు గోచరిస్తున్నాయి.

## మన బిడ్డలను సరైన మార్గములో పెంచటానికి ప్రయత్నము చేయాలి

దివ్యాత్మస్వరూపులారా! అందరియందున్న ఆత్మ ఒక్కటే! తన ఆత్మను తాను నమ్మి జీవించటానికి ప్రయత్నించాలి. తనను తాను నమ్మలేకపోతున్నాడు, యీనాటి మానవుడు. ఇలాంటి పరిస్థితులలో దుర్భావములు, దుచ్చింతలు సంభవిస్తున్నాయి. మనకు ఆధారమైనది భగవన్నామమే! ఆ నామముకూడా గృహమునుండి ఆవిర్భవించాలి. మన యింటినుండే బయలుదేరాలి. అప్పుడే మన పిల్లలయందుకూడా దివ్యభావములు

srisathyasaivacharamrutam

ఏర్పడుతుంటాయి. పిల్లలే భావి భారతోద్ధారకులు. కనుక, మన బిడ్డలను సరైన మార్గములో పెంచటానికి ప్రయత్నము చేయాలి. దురదృష్టవశాత్తు ఈనాటి తల్లులు శ్రీమంతులు అయినవారు తమ పిల్లలను తాము చూచుకోటంలేదు. ఏదో ఆయా చేతికి అప్పచెప్పి హాయిగా కూర్చుంటున్నారు. కట్టకడపటికి ఏమై పోతున్నాది? పుట్టిన బిడ్డలు ఆయా చేతిలో పెరగటంచేత ఆయా చస్తే ఏడుస్తారు గానీ అమ్మ చస్తే ఏడవరు. కారణం ఏమిటి? తల్లికి బిడ్డలతో పరిచయమే లేదు. తల్లిపాలతో పెరిగి తల్లిస్పర్శతో అభివృద్ధి గాంచిన పిల్లవాడు మహాగుణవంతుడుగా ఉంటాడు. ఈనాడు తల్లి పాలే కరవైపోయింది. పిండిపాలు అధికమై పోయాయి. కనుక, ఈనాటి పిల్లలకు డబ్బాబుద్ధులే వస్తున్నాయి. ఇలాంటి బుద్ధులు రాకుండా తల్లులు జాగ్రత్త పడాలి. ఈ విధంగా గృహమును మనం కాపాడుకుంటే దేశమునే కాపాడినవారమవుతాము. దేశముకోసమని మీరు పాటుపడనక్కరలేదు. సత్యమును పలికేలా పిల్లలకు బోధించు. ధర్మము అంటే ఏమిటో పిల్లలకు బోధించు. మహానీయుల చరిత్రలు చక్కగా శ్రవణము చేయించు. పూర్వము ఇండ్లలో పెద్దవారు పిల్లలకు మంచి కథలు చెబుతుండేవారు. ఈనాటి పెద్దలలో ఆ సాంప్రదాయము ఏది?

**అంత్యకాలములో దేనిని స్మరిస్తామో అదే పునర్జన్మమునకు పునాది**

ఆనాటి పెద్దలను చూస్తే ఈనాటివారు పరిహసిస్తారు. కాదు కాదు. ఆనాటి పెద్దలు నాటిన విత్తనములు అంతో యింతో పల్లెలయందే అభివృద్ధి అవుతున్నాయి. మన భారతీయసంస్కృతిని పునరుద్ధరింపచేయటానికి పల్లెలే ఆధారము. మహావిలువైనది, మన ప్రాచీనసంస్కృతి. తెల్లవారిలేచినది మొదలు భగవన్నామముతో ప్రారంభమయ్యేది. మీకందరికి తెలుసు. కాశీ క్షేత్రములో మరణించే సమయములో 'శ్రీరామ రామరామేతి రమే రామే మనోరమే' అని చెవులలో పలుకుతుంటారు. జీవితకాలములో చేసిన స్మరణ అంత్యకాలములో ఆదరణకోసమని. అంత్యకాలములో దేనిని మనం ఆధారముగా తీసుకొని స్మరిస్తామో అదే పునర్జన్మమునకు పునాది. కనుక మనము మన పిల్లలకు ఏ పిచ్చి పిచ్చి మాటలో, ఏ పిచ్చి పిచ్చి పాటలో, పద్యాలో చెప్పకుండా పవిత్రమైన దైవచింతన వారికి

srisathyasai vahanmrutam

బోధించటానికి ప్రయత్నించాలి. పూర్వకాలములో అక్షరస్వీకారము చేసే సమయంలోపల 'ఓం నమశ్శివాయ' పంచాక్షరి నామము ప్రబోధించేవారు. లేక 'ఓం నమో నారాయణాయ' అని అష్టాక్షరి నామాన్ని స్మరింపచేసేవారు. ఇప్పుడు ఏమిటి అక్షరాభ్యాసము? అక్షర భావములే లేవు. 'బాబా బ్లాక్ షీప్'. ఇదా మన పిల్లలకు చెప్పేది? Ding Dong bell ... ఇలాంటివి పిల్లలకు చెబుతున్నాం మనము. ఇది కాదు పిల్లల హృదయములలో నాట వలసింది. 'రామా, కృష్ణా, గోవింద, నారాయణ'. ఇలాంటి పవిత్రనామాన్ని మనం ప్రబోధించాలి. జయదేవుడు చెప్పేవాడు. 'జిహ్వే రసజ్ఞే మధుర ప్రియే త్వం సత్యం హితం త్వాం పరమం వదామి ఆవర్ణయేథాం మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి'. 'పవిత్రమైన నాలుకా! రసమెరిగిన నాలుకా! నీవు స్మరించవలసినది ప్రాకృతమైనదికాదు. మధురమైన అక్షరములను ప్రబోధించాలి'. ఏమిటి ఆ మధురమైన పలుకులు? ఈనాటి భక్తులయొక్క కన్నులదృష్టి ఏవిధంగా ఉంటున్నది? చంద్రునియొక్క దృష్టివలే ఉంటుండాలి. వెన్నవలె పలుకులు ఉంటుండాలి. తేనెవంటి హృదయముగాఉంటుండాలి. ఇదియే ఈనాటి మానవునికి అత్యవసరము. పలుకులు చూస్తే చాలా కఠినమైన పలుకులు. కాదు కాదు. వెన్నవంటి పలుకులుగా ఉండాలి. అవి మధురమైనవిగాను, సున్నితమైనవిగాను ఉండాలి. ఇక కన్నులతో చూసే దృష్టి. వికారమైన దృష్టిని మనం చూస్తున్నాము. వినోదములైన దృష్టులను చూస్తున్నాము. విజ్ఞానసంబంధమైన దృష్టిని మనం చూడటంలేదు.

**ప్రతి మానవుడు మంచిని చేసి, మంచిని చూసి, మంచిని తలచి మంచిగా జీవించాలి**

**కన్నుల నిచ్చిన దెందుకొ తెలుసా!**
**అన్నియు చూచేటందులకా? కాదు కాదు**
**కైలాసవాసుని చూచేటందుకురా!**

సీతాలక్ష్మి చెప్పింది, స్వామి పాట కొంతవరకు

**ముందు షిరిడీ నేడు పర్తి ఉన్నవాడని పేరే గానీ**
**తన్ను భావనచేయు భక్తుల కన్నులందే మెలగుచున్నా**

sri sathyasai vahini amrutam

## కన్నువిప్పి చూడరోరన్నా ఈ సాయిదేవుని ఎన్నగా ఎందైన కలడన్నా

మన భావములు దివ్యభావములుగా, దైవసంబంధమైన భావములుగా మన హృదయములో చిత్రించుకోవాలి. ఒక చిన్న ఉదాహరణము. ఈనాటి మానవుని విశ్వాసము ఎంతవరకు దిగజారిందంటే, 'దేవుడు తిరుపతిలో ఉంటున్నాడు, భద్రాచలములో నుంటున్నాడు, బదరీనాథ్‌లో ఉంటున్నాడు, కేదార్‌నాథ్‌లో ఉంటున్నాడు, అమర్‌నాథ్‌లో ఉంటున్నాడు', అని చెప్పి మనము ప్రయాణము చేస్తున్నాము. ఇవన్నీ మనస్సుయొక్క చేష్టలు. కానీ 'నాయనా! దేవుడు అక్కడ ఇక్కడ లేదు. నీ హృదయమందే ఉంటున్నాడ'ని చెబితే ఎవరూ విశ్వసించరు. అంత సమీపములోనున్న దైవమును విశ్వసించరు. ఎక్కడో ఉన్నాడంటే డబ్బు ఖర్చుపెట్టుకొని ప్రయాణమై శ్రమలు పడి వెడతారు. బయట ఉన్నాడనుకోటం భ్రమ. మనయందే, మన హృదయమునందే ఉంటున్నాడనేది సత్యము. అతనే సర్వవిధములైన గైడెన్సు ఇస్తున్నాడు. అట్టి సత్యమును మనము ఈనాడు విస్మరిస్తున్నాము. బయట ప్రపంచములో ఏమీ లేదు. ఉన్నదంతా మనయందున్నదే ప్రతిబింబిస్తున్నాది. ఏమిచేస్తే దానికి ప్రతిఫలము నందిస్తున్నాడు. కనుక ప్రతి మానవుడు మంచిని చేసి, మంచిని చూసి, మంచి తలచి, మంచిగా జీవించాలి. ఇదియే నిజమైన వేదాంతము.

## పరిపూర్ణ స్వరూపుడైన భగవంతుని పరిపూర్ణ హృదయముతో ప్రార్థించాలి

భగవంతుడు ఎక్కడనో లేడు. నీ హృదయమందే ఉంటున్నాడు. అట్టి హృదయస్థాయి దైవత్వమును పరిపూర్ణముగా విశ్వసించాలి. భగవంతుడు పరిపూర్ణుడు కనుక మనముకూడా పరిపూర్ణ ప్రేమను పెంచుకోవాలి. కనుక 'పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్‌పూర్ణ ముదచ్యతే'. అతను పూర్ణుడే మనము పూర్ణులే. ఇలాంటి విశ్వాసము అభివృద్ధి కావాలి. పూర్ణస్వరూపుడైన భగవంతుని మనము అపూర్ణముగా ప్రార్థిస్తే మనకు ఫలితము రాదు. పరిపూర్ణస్వరూపుడైన భగవంతుని పరిపూర్ణహృదయముతో ప్రార్థించాలి. ప్రతి మానవునియందు ఎప్పటికప్పుడు సిద్ధముగా ఉన్నది ప్రేమ ఒక్కటే! కోపము రావచ్చు, పోవచ్చు. అహంకారము రావచ్చు, పోవచ్చు. అసూయ రావచ్చు, పోవచ్చు. అభిమానము

srisathyasaivahini

రావచ్చు, పోవచ్చు. కానీ ఎప్పటికి రాకపోకలులేని దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన, శాశ్వతశక్తిపేరు ప్రేమ ఒక్కటే! ఆ ప్రేమ అందరియందు ఉంటున్నది. ప్రేమచేత మన జీవితము సాగించటానికి ప్రయత్నించాలి. ఆ ప్రేమకు స్త్రీలే పుట్టినిల్లు. దానినే భక్తి అన్నారు. జ్ఞానమును పురుషుడు అన్నారు. భక్తి అనే స్త్రీ అంతఃపురములో ప్రవేశిస్తుంది. కానీ జ్ఞానము అనే పురుషుడు కేవలము దర్బారు హాలువరకే ప్రవేశిస్తాడు గానీ లోపల ప్రవేశించలేడు. అట్టి స్వాతంత్ర్యము కలిగిన స్త్రీలు, భక్తిస్వరూపులు. అట్టి భక్తి, ప్రపత్తులకు మూలాధారము స్త్రీలే! మీరు వేరుగా భావించకండి! ఈనాడు ఇక్కడకు వచ్చిన పురుషులందరు మొట్టమొదట స్త్రీల ప్రబోధలచేత వారు ఇక్కడకు వస్తున్నారు. వారే అతి పవిత్రమైన భావముచేత పతులను లాక్కొని వస్తున్నారు. వారు చేసే పని చాలా పవిత్రమైన పనియే కానీ మరొకటికాదు. 'తాము తరించాలి, తమ పతులు తరించాలి' అనే ఉత్తమమైన భావముచేత, విశాలమైన భావముచేత, ఈ భక్తి ప్రపత్తులు పెంచుకుంటూ వచ్చారు.

## ఎక్కడ స్త్రీలు గౌరవింపబడుతారో అక్కడ సర్వసౌఖ్యములు అభివృద్ధి చెందుతాయి

స్త్రీలంటే హీనంగా మనం భావించరాదు. మహా శక్తివంతులు. అందువలననే భగవద్గీతలో చెప్పినట్టు స్త్రీలలో ఏడు శక్తులుంటున్నాయి. మగవానియందు మూడు శక్తులుమాత్రమే ఉంటున్నాయి. యింత శక్తిసామర్థ్యములు కల్గినవారు స్త్రీలు. అలాంటివారిని మనము హాస్యాస్పదముగా చూచి, వారిది తుచ్ఛమైన జీవితముగా భావిస్తున్నాము. చాలా పొరపాటు. అదే పెద్దపాపము. ఒక చిన్న ఉదాహరణము చూడండి. పతులను బ్రతికించుకున్న సతులు అనేకమంది ఉంటున్నారు. ఎన్నో విధముల ప్రార్థనలు చేసి శాంతినందించటానికి ప్రయత్నాలు చేశారు. సతులను బ్రతికించుకున్న పురుషుడు ఒక్కడున్నాడా? 'పోతే పోయింది', అని రెండవ వివాహమునకు సిద్ధమవుతారు. యిలాంటి ప్రాచీనసంస్కృతియందు మన భారతదేశము పుట్టి పెరిగి అభివృద్ధి గాంచినది. దీనిని మనం కేవలం తక్కువగా చూడకూడదు. ఎక్కడ స్త్రీలను గౌరవిస్తామో అక్కడ సర్వసౌఖ్యములు అభివృద్ధి చెందుతాయి. సర్వకళ్యాణములు చేకూరుతాయి. స్త్రీలను ఏమాత్రము దూషించరాదు, విమర్శించరాదు, హింసించరాదు. 'కలకంఠి కంట కన్నీరొలికిన

సిరియింటనుండదు’. ఒక స్త్రీకి కంటినీరు వచ్చిందంటే ఆ యింటిలో సిరిసంపదలుండవు. ఇలాంటి సంప్రదాయముతోకూడినది మన పవిత్ర భారతదేశము. ఏ కొద్ది సమయము చిక్కినా భగవన్నామము స్మరించి భగవచ్చింతనచేత కాలము సార్థకము గావించుకోవాలి.

**(తేదీ 19-10-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam